క్లుప్తంగా

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

ఆత్మకూరురూరల్/ఉదయగిరి: ఈ నెల 19న శ్రావణ పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో జరిగే గిరిప్రదక్షణకు వెళ్లే భక్తుల కోసం ఆత్మకూరు, ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక సూపర్‌లగ్జరీ సర్వీసును నడుపుతున్నట్లు ఆ డిపోల మేనేజర్లు కరీమున్నీసా,శ్రీనివాసరావు శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. 18, ఉదయగిరి డిపో నుంచి బయలుదేరి దుత్తలూరు, వింజమూరు, ఆత్మకూరు మీదుగా బస్సు వెళ్తుందని చెప్పారు. రానుపోను టిక్కెట్ ధర ఉదయగిరి నుంచి రూ.16,50, ఆత్మకూరు నుంచి రూ.1400గా నిర్ణయించినట్లు తెలిపారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉందన్నారు. అరుణాచలం క్షేత్రంతో పాటు మార్గం మధ్యలో కాణిపాకం, సిరిపురం బంగారు గుడి సందర్శించే వెసులుబాటు కల్పిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు డీఎం 99592 25645, అసిస్టెంట్ మేనేజర్ 99660 09395, బస్సు డ్రైవర్ 94918 96872 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వీవీగిరికు నివాళి



అల్లూరు: మండల పరిషత్ కార్యాలయంలో మాజీ రాష్ట్రపతి వీవీ గిరి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. వీవీ గిరి చిత్రపటానికి ఎంపీడీఓ జ్యోతి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్రపతిగా ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈఓపీఆర్డీ వీరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రేపట్నుంచి సర్పంచ్‌లకు శిక్షణ

సీతారామపురం/ఆత్మకూరురూరల్: పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం నుంచి బుధవారం వరకు మూడ్రోజుల పాటు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీతారామపురం ఎంపీడీఓ అబ్దుల్‌కలాంఆజాద్, ఆత్మకూరు ఎంపీడీఓ వేర్వేరు ప్రకటనల్లో శనివారం తెలిపారు. మండల పరిషత్‌కార్యాలయంలో జరిగే శిక్షణ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి, పారిశుధ్య నిర్వహణపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు విధిగా హాజరుకావాలని కోరారు.

స్వాతంత్య్ర వేడుకలకు నిధుల పెంపుపై హర్షం

ఉదయగిరి: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు సంబంధించి పంచాయతీ సాధారణ నిధుల నుంచి వాడుకునే మొత్తాన్ని పెంచడంపై నియోజకవర్గానికి చెందిన పలువురు సర్పంచ్‌లు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గతంలో మైనర్ పంచాయతీల్లో రూ.100 ఖర్చు చేసే అవకాశం ఉండగా, రూ.10 వేలు, మేజర్ పంచాయతీల్లో రూ.25 వేల వరకు ఖర్చు చేసుకునే అవకాశాన్ని కల్పించడంపై సంతోషం వ్యక్తం చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆత్మకూరు: పట్టణంలోని రోడ్లతో పాటు జాతీయ రహదారిపై ప్రయాణించే వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని ఆత్మకూరు నూతన సీఐ జీ గంగాధర్ సూచించారు. పట్టణం, బైపాస్‌రోడ్డు, నెల్లూరుపాళెం సెంటర్‌లో ట్రాఫిక్‌ను శనివారం ఆయన పరిశీలించారు. పట్టణంలో ట్రాఫిక్‌ను ప్రజలకు ఇబ్బంది లేకుండా నియంత్రించేందుకు ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెలిపారు. జాతీయ రహదారిపై వాహనాలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేయకుండా చర్యలు చేపడుతామన్నారు. ఆయన వెంట సీఐ ముత్యాలరావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

వసతి గృహాలను మూసివేయడం తగదు

ఉదయగిరి: పట్టణంలోని బీసీ, ఎస్సీ వసతి గృహాలను విద్యార్థులు లేరనే నెపంతో మూసివేయడం తగదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన ఉదయగిరిలో విలేకరులతో మాట్లాడారు. వెనుకబడిన ఉదయగిరి నియోజకవర్గ కేంద్రంలో వసతి గృహాలను మూసివేస్తే పేద విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారుతుందన్నారు. ప్రసుతం ఉన్న బాలికల వసతిగృహాన్ని కూడా అధికారులు మూసివేయాలని భావిస్తున్నారని, దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. పట్టణంలోని డిగ్రీ, జూనియర్ కళాశాలలతో పాటు వ్యవసాయ కళాశాలకు వచ్చే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక వసతి గృహాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

గుండెపోటుతో విలేకరి మృతి

కావలి : పట్టణంలో విలేకరిగా పనిచేస్తున్న జరుగుమల్లి అనిల్ (42) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. మధ్యాహ్నం ఇంట్లో భోజనం చేసిన తర్వాత గుండెల్లో నొప్పిగా ఉందని చెప్పగా ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఇసుకాసురులు

- పెన్నా, బొగ్గేరు నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- టీడీపీ నాయకుల అండదండలతో చెలరేగిపోతున్న అక్రమార్కులు
- కన్నెత్తి చూడని అధికారులు



సోమశిల: అనంతరసాగరం మండలం శంకరనగరంలో డంప్ చేసిన ఇసుక

ఆత్మకూరురూరల్/మర్రిపాడు/సోమశిల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నాయకులు చెలరేగిపోతున్నారు. అనంతసాగరం, ఆత్మకూరు మండలాల పరిధిలోని పెన్నా నదితో పాటు మర్రిపాడు మండలంలోని బొగ్గేరులోని ఇసుకను పెద్దఎత్తున దోచేస్తున్నారు. రాత్రి వేళల్లో పెద్ద ఎత్తున ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సి అధికారులు ఆ వైపుగా కన్నెత్తి చూడడం లేదు. టీడీపీ నాయకుల బెదిరింపులు..మామూళ్ల మత్తుతోనే అధికారులు చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇసుక డంప్ చేసి లారీల్లో తరలింపు

అనంతసాగరం మండలంలోని టీడీపీ నాయకులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చెలరేగిపోతున్నారు. యథేచ్ఛగా పెన్నా నది నుంచి ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రేవూరు, శంకరనగరం గ్రామాల సమీపంలోని పెన్నానది నుంచి జేసీబీ, ట్రాక్టర్ల సాయంతో పెద్ద ఎత్తున ఇసుకను బయటకు తరలించి డంప్ చేస్తున్నారు. అనంతరం లారీల ద్వారా సుదూర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అలాగే సోమశిల, పడమటికంభంపాడు, బెడుసుపల్లి, లింగంగుంట, దేవరాయపల్లి తదితర గ్రామాల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. యథేచ్ఛగా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నా అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. స్థానికులు సెబ్ అధికారులకు సమాచారం ఇచ్చినా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బొగ్గేరు నుంచి బ్రిక్స్ వ్యాపారులకు

మర్రిపాడు మండలంలో ఇసుక డంపింగ్ యార్డు ఉంది. అయినా బ్రిక్స్ వ్యాపారులకు బొగ్గేరులోని ఇసుకను రేయింబవళ్లు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. బ్రిక్స్ వ్యాపారులు గృహ నిర్మాణాలకు సంబంధించిన సామగ్రిని తయారు చేస్తుంటారు. వారికి పెద్ద ఎత్తున ఇసుక అవసరం. డంపింగ్ యార్డులోని ఇసుక కొనుగోలుకు ఎక్కువ వెచ్చించాల్సి రావడంతో ఇసుక అక్రమ రవాణాదారులను సంప్రదించి బొగ్గేరులోని ఇసుకను తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ తమ వ్యాపారాలను సాగిస్తున్నారు. రాత్రి వేళల్లో బొగ్గేరు నుంచి ట్రాక్టర్ల ద్వారా పెద్ద ఎత్తున ఇసుక తరలిస్తున్నా కట్టడి చేయడంలో అధికారులు ప్రేక్షక పాత్ర వహించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. రెండ్రోజుల క్రితం మర్రిపాడులో బొగ్గేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను గ్రామస్తులు పట్టుకున్నా పోలీసులు మధ్యస్తం చేసి విడిపించారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. ప్రస్తుతం వర్షాలు లేక లేక బొగ్గేరులో నీటి ప్రవాహం లేదు. దీంతో ఇసుకాసురులు బొగ్గేరును కొల్లగొట్టి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదిలాగే కొనసాగితే భవిష్యత్తులో భూగర్భజలాలు అడుగంటి బోర్లు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాత్రి వేళల్లో గుట్టు చప్పుడు కాకుండా..

ఆత్మకూరు మండలంలోని వాశిలి సమీపంలోని పెన్నానది నుంచి రాత్రి వేళల్లో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోంది. అధికార పార్టీ నాయకుల అండతో ఆత్మకూరుకు చెందిన కొందరు ఈ దందాను కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పెన్నానది నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించి చెరువుకట్ట సమీపంలో నిల్వ చేసి టిప్పర్లలో తరలిస్తున్నారు. ఇసుక దందాను గ్రామస్తులు ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారు . ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ హెచ్చరికలు కూడా జారీ చేస్తున్నారని వాశిలి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖల అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు

కొత్తగా బాధ్యతలు స్వీకరించా. ఇసుక అక్రమ రవాణాను పరిశీలించి చర్యలు తీసుకుంటాం. మర్రిపాడు ఇసుక డంపింగ్ యార్డు ఉన్నందున బొగ్గేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటాం.

– స్వప్న, తహసీల్దార్

భూగర్భజలాలు అడుగంటే ప్రమాదం



బొగ్గేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. దీని వల్ల భూగర్భ జలాలు అడుగంటి బోర్లు ఎండిపోయే ప్రమాదముంది. బోర్లపై ఆధారపడి పంటలు సాగుచేస్తున్నాం. బోర్లు ఎండిపోతే నష్టపోతాం. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి

– బెజవాడ అంకయ్య, రాంపల్లి



మర్రిపాడులోని ఓ బ్రిక్స్ తయారీ కేంద్రంలో నిల్వ చేసిన బొగ్గేరు ఇసుక



సోమశిల: రేవూరులో అక్రమంగా ఏర్పాటు చేసిన ఇసుక డంపింగ్ యార్డు



ఆత్మకూరురూరల్: వాశిలి చెరువుకట్ట సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక

13న ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీ



వింజమూరు(ఉదయగిరి): ఇటీవల ఎస్సీ వర్గీకరణ న్యాయ సమ్మతమే అంటూ సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఈనెల 13న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు పందిటి అంబేడ్కర్ మాదిగ తెలిపారు. శనివారం ఆయన వింజమూరులో విలేకరులతో మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు తరువాత మంద కృష్ణమాదిగ తెలుగు నేలపై అడుగుపెడుతున్న నేపథ్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో మాదిగలు ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నాయకులు బాలగురువయ్య, రమణయ్య, సుజాత, సింహాద్రి, వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

మేకపాటి పరామర్శ



మాలకొండరాయుడును పరామర్శిస్తున్న మేకపాటి రాజగోపాల్ రెడ్డి

వరికుంటపాడు: మండలానికి చెందిన పలువురిని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి శనివారం పరామర్శించారు. మండల బీసీ సెల్ అధ్యక్షుడు పోలుబోయిన మల్లికార్జున తండ్రి మాలకొండరాయుడు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన తిమ్మారెడ్డిపల్లికి చెందిన జడప్రోలు సుందరరామిరెడ్డిని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం తూర్పురొంపిదొడ్ల ఎస్టీ కాలనీకి చెందిన ఇండ్ల అల్లూరయ్య ఇటీవల మృతి చెందగా కుటుంబ సభ్యులను పరామర్శించి అన్ని వేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మందలపు తిరుపతినాయుడు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాగంటి శ్రీనివాసులు, సొసైటీ మాజీ అధ్యక్షుడు గుంటుపల్లి రామాంజనేయులు, జేసీఎస్ మండల కన్వీనర్ బొడ్డు వెంకటేశ్వర్లు, సర్పంచ్ కుమ్మిత ప్రతాప్‌రెడ్డి, నాయకులు దాసరి యర్రఓబయ్య, రాయవరపు మధుసూదన్‌రావు, మేడసాని చెన్నకేశవులు, దారపునేని చెన్నారాయుడు, బంగారు బాబు, మాలకొండయ్య, మాలకొండరావు, తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

వెండి కిరీటం, చెవి దిద్దుల బహూకరణ



వరికుంటపాడు: స్థానిక పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలోని మూలవిరాట్‌కు ప్రకాశం జిల్లా పామూరుకు చెందిన కొండేటి వెంకటసుబ్బయ్య, ధర్మపత్ని అమ్మణ్ణి దంపతుల కుమారులు వెంకట సురేష్, లక్ష్మీప్రసన్న, వెంకటరమేష్, సుభాషిణి దంపతులు, వెంకట భావన, వెంకటసాయిచరణ్ వెండి కిరీటం, వెండి చెవి దిద్దులను శనివారం బహూకరించారు. ఆలయ అర్చకులు వెండి కిరీటాన్ని, చెవి దిద్దులను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాతలను ఆలయ ధర్మకర్త పెండ్యాల సూర్యనారాయణ సత్కరించారు. పామూరుకు చెందిన పారిశ్రామికవేత్త యారవ శ్రీనివాసులు వారి మిత్రుల సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


సోమశిల: అనంత సాగరం మండలం రేవూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు. నెల్లూరు రూరల్ పరిధిలోని బుజబుజనెల్లూరుకు చెందిన షేక్ మక్బూల్‌జాన్(55) అనంతసాగరం మండలం ముస్తాపురం గ్రామానికి శుభకార్యం నిమిత్తం గురువారం వచ్చారు. శుక్రవారం తిరిగి బైక్‌పై వెళ్తుండగా రేవూరు వద్ద రోడ్డు గుంతల్లో అదుపుతప్పి పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. నెల్లూరులోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి



చేజర్ల: సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయలలిత అన్నారు. చేజర్ల మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు మూడ్రోజుల పాటు నిర్వహించిన శిక్షణా కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా చూడాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని సూచించారు. సంపద కేంద్రాల వద్ద ఖాళీ ప్రదేశం ఉంటే పండ్లు, కూరగాయల మొక్కలు పెంచాలని సూచించారు. పంచాయతీ నిధులను వినియోగించుకుని ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. ఈఓపీఆర్డీ రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోస్టుమెన్‌కు సన్మానం



సీతారామపురం: మండలంలోని బసినేనిపల్లి పంచాయతీలో పోస్టుమెన్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన అల్లూరి చినఓబులపతిని బెస్ట్‌ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఓబులపతి పోస్టుమెన్‌గా 44 ఏళ్ల పాటు బసినేనిపల్లి పంచాయతీలో అందించిన సేవలను కొనియాడారు. సెల్‌ఫోన్లు రాకముందు ప్రతిఒక్కరూ తమ బంధువుల యోగక్షేమాలను తెలుసుకునేందుకు పోస్టుమెన్ ఓబులపతి కోసం ఎదురుచూసేవారమని నాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. అనంతరం ఓబులపతి దంపతులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. బెస్ట్‌ఫ్రెండ్స్ అసోసియేషన్ నాయకులు బొగ్గవరపు వెంకటరత్నం, బాలమూర్తి, జొన్నలగడ్డ చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

16న లక్ష కుంకుమార్చన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వీరబ్రహ్మయ్యస్వామి

కావలి : మండలంలోని రాజువారిచింతలపాళెంలో ఉన్న విజయదుర్గ ఆస్థాన పీఠంలో ఈ నెల 16న సామూహిక లక్ష కుంకుమార్చనను వైభవంగా నిర్వహించనున్నట్లు వీరబ్రహ్మయ్యస్వామి తెలిపారు. పట్టణంలోని జర్నలిస్టు క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 30 ఏళ్లుగా శ్రావణమాసంలో వరలక్ష్మీ వ్రతం నాడు లక్ష కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈ ఏడాది లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కావలి పట్టణంతో పాటు పరిసర ప్రాంత భక్తులు కుంకుమార్చనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. విజయదుర్గ ఆస్థాన పీఠం ఆలయ చైర్మన్ వేముల చెన్నకేశవ నాయుడు సహాయ సహకారాలతో భక్తులకు పూజా సామగ్రిని ఉచితంగా అందజేయనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ ట్రెజరర్ చంద్రమౌళి, భక్తులు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు



సీతారామపురంలో యూటీఎఫ్ జెండా ఆవిష్కరణ



మర్రిపాడులో ..

ఆత్మకూరు: యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలను పట్టణంలోని ప్రాంతీయ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు, ఏఎస్‌పేట, అనంతసాగరం, మర్రిపాడు మండలాలకు చెందిన యూటీఎఫ్ నాయకులు, సీఐటీయూ నాయకులతో పాటు పలువురు ఉపాధ్యాయులు హాజరయ్యారు. తొలుత యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం వద్ద నిర్వహించిన సభలో పలువురు వక్తలు మాట్లాడారు. 50 ఏళ్ల క్రితం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ ఆవిర్భవించిందని తెలిపారు.అప్పట్నుంచి ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటాలు సాగిస్తూ, పరిష్కారానికి కృషి చేస్తూ ఉపాధ్యాయుల మన్ననలను చూరగొంటోందన్నారు. యూటీఎఫ్ సీనియర్ నాయకులు గంగాధర్, మల్లికార్జునరావు, ఎల్‌కే ప్రసాద్, జిల్లా మాజీ కార్యదర్శి శివప్రసాద్‌రావు, కార్యవర్గ సభ్యులు మోహన్‌రావు, ఖాదర్‌బాషా, వెంకటరెడ్డి, సాధిక్, వరప్రసాద్, ఖాజా, సుధాకర్, సీఐటీయూ నాయకులు శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ జెండా ఆవిష్కరణ

మర్రిపాడు: యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మర్రిపాడులోని యూటీఎఫ్ భవన్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్వీట్లు పంచారు. యూటీఎఫ్ జిల్లా కుటుంబ సంక్షేమ డైరెక్టర్ ఎస్‌కే నాయబ్‌రసూల్, మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్, నాయకులు పీ గురుస్వామి, కే బాలగురవయ్య, ఎస్ వెంకటేశ్వర్లు, జీ వెంకటేశ్వర్లు, ప్రజాసంఘాల నాయకులు సుధాకర్, మహ్మద్‌గౌస్, భవన నిర్మాణ కార్యదర్శి డీ జాన్సన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు

సీతారామపురం: యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలను మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత బస్టాండ్ సెంటర్‌లోని కార్యాలయం వద్ద యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టి సంబరాలు జరుపుకొన్నారు. యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గొడ్లవీటి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి యడమ తిరుపతయ్య, నాయకులు పేరాల శ్రీనివాసులు, మహేష్, వెంకటేశ్వర్లు, పవిత్రకుమారి, ప్రసాద్, విజయకుమారి, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలను స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు కంభాల చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు ప్రమాదకరంగా మారిన 117 జీఓను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల సర్దుబాటు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఉద్యోగులకు ప్రభుత్వం వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. నాయకులు దస్తగిరిఅహ్మద్, ఫణిరాజు, మున్నా, కరీం, ఖాదర్ బాషా, సుబ్బారెడ్డి, అరాఫత్, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు



ఉదయగిరిలో..

తల్లిదండ్రులు బాధ్యత వహించాలి



మాట్లాడుతున్న ఏఎస్‌డబ్ల్యూఓ శ్రీదేవి

ఆత్మకూరు: విద్యార్థినులను వసతిగృహంలో వదిలినంత మాత్రన తల్లిదండ్రుల బాధ్యత పూర్తి కాదని, వారిని తరచూ పరిశీలిస్తూ క్రమశిక్షణతో ఉండేలా బాధ్యత వహించాలని బీసీ వసతిగృహ సంక్షేమాధికారిణి (ఏఎస్‌డబ్ల్యూఓ) చల్లా శ్రీదేవి అన్నారు. పట్టణంలోని బీసీ కళాశాల విద్యార్థినుల వసతిగృహంలో తల్లిదండ్రుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఏఎస్‌డబ్ల్యూఓ శ్రీదేవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థినులను వసతిగృహ అధికారులు, సిబ్బంది సొంత బిడ్డల్లా చూసుకుంటారన్నారు. అదే క్రమంలో తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపి విద్య, క్రమశిక్షణను గమనిస్తుండాలన్నారు. తల్లిదండ్రుల ఆశలు నెరవేరేలా విద్యార్థినులు చదువులో రాణించి ఉన్నత స్థానాల్లో తమ జీవితాలను స్థిరపరుచుకోవాలని కోరారు. వార్డెన్ సునీత, ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు శిరీషా, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై పొంచి ఉన్న ప్రమాదం



బొగ్గేరు బ్రిడ్జిపై జాయింట్ల వద్ద బయటపడిన కమ్ములు

ఆత్మకూరు: నెల్లూరు–ముంబాయి జాతీయ రహదారిపై ప్రమాదం పొంచి ఉంది. ఈ మార్గంలో ఆత్మకూరు పరిధిలోని గొల్లపల్లి వద్ద బొగ్గేరుపై నిర్మించిన భారీ వంతెనపై పలుచోట్ల జాయింట్ల వద్ద రబ్బర్లు ఎగిరిపోయి కాంక్రీట్ దెబ్బతిని కమ్ములు బయటకు కనిపిస్తున్నాయి. ఈ రహదారిపై నెల్లూరులోని వెంకటేశ్వరపురం వద్ద ఉన్న ఫ్లెటైవర్ దెబ్బతిన్నా మరమ్మతులు చేపట్టకుండా నిర్లక్ష్యం వహించడంతో నెల రోజు క్రితం భారీ గుంత ఏర్పడింది. దీంతో బ్రిడ్జిని మూసివేసి రాకపోకలను మళ్లించడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెల్లూరు నుంచి రాయలసీమ జిల్లాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. ఈ మార్గంలోనే కృష్ణపట్నపోర్టు నుంచి బళ్లారి, కడప, తదితర ప్రాంతాలకు ఇనుప ఖనిజం, సిమెంట్, తదితరాలను తరలించే భారీ వాహనాలు ప్రయాణిస్తుంటాయి. బొగ్గేరుపై బ్రిడ్జి మరింత దెబ్బతిని వాహనాల రాకపోకలు నిలిచిపోతే ప్రయాణికులతో పాటు రవాణా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంటుంది. అందువల్ల అధికారులు స్పందించి జాయింట్ల వద్ద ఏర్పడిన గుంతలు మరింత పెద్దవై వంతెన ప్రమాదానికి లోనుకాకముందే మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చెరువులకు సోమశిల జలాలు అందించాలి

కలిగిరి: మండలంలోని చెరువులకు ఉత్తర కాలువ ద్వారా సోమశిల జలాలను అందించాలని జెడ్పీటీసీ పాలూరు మాల్యాద్రిరెడ్డి కోరారు. నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గొట్టిపాటి కొండపనాయుడు ఉత్తర కాలువకు సంబంధించి క్రాకుటూరుకు పోయే సబ్ కెనాల్ అసంపూర్తి ఉందన్నారు. ఈ కాలువను పూర్తి చేసి క్రాకుటూరు, పోలంపాడు, కుమ్మరకొండూరు, పెద్దపాడు చెరువులకు సాగునీటిని అందించాలని కోరారు. శ్రీకొలను సబ్ కెనాల్ ద్వారా గుడ్లదొన, అనంతపురం, లక్ష్మీపురం, తదితర ప్రాంతాల చెరువులకు సాగునీటిని అందించాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు అవసరమైన చోట రాకపోకలు సాగించడానికి వీలుగా కాలువలపై వంతెనలు నిర్మించాలని కోరారు.